కథనం:

# రగల్ రాజ్జెం మైసివాకట్

తొడసం జంగు

పశువుల కాపర్లు పశువులను లొద్దులకు తరలిస్తున్నారు.... పశువుల అరుపులకు లొద్ది ప్రతిధ్వనిస్తోంది.... కోపంగా, అసహనంగా పశువుల కాపర్లు వేసే కేకలు.... ఎక్కడెక్కడ జీవాలు తిరుగుతున్నాయో ఒకరికొకరు చెప్పుకునే హెచ్చరికలు ఒకపక్క, ఇంకొకపక్క మేకలను అడవికి తోలుకెల్లుతూ పిల్లలు పాడే పాటలు— మేకల తుమ్ములు— మొత్తానికి ఊరి బయట యమసందడిగానే వున్నది.... మామూలుగానైతే ఈపాటికి ఊళ్ళో ముసలివాళ్ళు మంచాలమీది పసిపిల్లలు తప్ప మరోపురుగు వుండేది కాదు. కాని ఈరోజు వూరువూరంతా తుకతుక వుడుకుతంది.... మరాఠారైతులు పిసపిసలాడుతూ గుడిసెల చూర్లకింద సాగిసాగి ముచ్చెట్లు బెడ్తండ్లు- తెలుగువాళ్ళు మరాఠావాళ్ళలాగే ఓరఓర చూస్తూ వాళ్ళ గుజులు కడుతున్నారు. ఇంకోపక్క గోండ్లు అట్లాగే తమ జాతివాళ్ళతి కలిసి ఎడతెగని ముచ్చెట్లు బెడుతున్నారు.... ఆ ఊరుకు దక్షిణం, తూర్పు దిక్కు పలుచగా విప్పచెట్లమధ్య కనుచూపు మేరదాకా వ్యాపించిన పంటభూములు.

ఉత్తరం, పడమర ఎత్తయిన గుట్టలు. గుట్టలమీద అడవి అప్పుడప్పుడే ఆకులు జాడిస్తూ చెట్ల మొదళ్లు... బండలు కనిపిస్తున్నాయి. ఊరు తూర్పునుంచి పడమటికంటా వ్యాపించి వున్నది.... పడమటికేసి గుట్ట ఊరి చివరనుండే ప్రారంభమౌతుంది...

ఊరు ఆఖరైనచోట బొగడమీద ఆ వూరికి వచ్చే అధికార్ల కోసం వేసిన బంగళా (గుడిసెనే బంగళా అంటారు) ఉన్నది. దానికి రెండు పక్కలా రెండువిత్తైన విప్పచెట్లున్నాయి.... ఆ బొగడకు దిగువన వందగజాల దూరంలో ఆపక్క ఈపక్క అశ్రద్ధగా వేసుకున్న గోండుల గుడిసెలు .. గట్టిగా గాలివీస్తే కూలిపోయేటట్లున్నాయి.... గుడిసెలు పేదపేదగా దరిద్రం వాసనవేస్తున్నాయి. ఆ గుడిసెల్లోని మనుషులు ఎండుకుపోయిన డొక్కలతో, ఆకలి ముఖాలతో మాట్లాడటమే పెద్దసాహస కార్యమయినట్లుగా వున్నారు.

గూడెం పటేల్ (పెద్ద) ఎ గోదిరావు గుడిసెలోనుంచి బయటకొచ్చా[illegible]నోట్లె కంటావంగినమీసాలు- వికృతంగా పొడుచుకొచ్చిన ఎముకల ముఖం, అసలే ముడు

చుకపోయున్నది... కండ్లకు చెయ్యడ్డం పెట్టుకొని పొద్దుకేసి చూశాడు.... ముఖం మరింత ముడుచుకపోయింది... కోపం, అసహ్యం మరింకేమి కలిగాయోగాని కాంద్రకీచ్చి ఉమ్మేద్దామనుకున్నాడు... ఉమ్మిరాలేదు. "పొరకలసార్లచ్చే ఏల్లయ్యింది. ఓరి భూములు, ఓరి (ఎవరి) జాగలు.... కల్లేసర్కారు- ఝూటాకానూన్" గొను గుతూ.... "ఇస్రూ" అంటూ కీచుగా కేకేశాడు.... రెండు గుడిసెల అవతలి నుంచి నల్లటి యువకుడొకడు పెదవులకంటిన అంబలి నాక్కుంట చేతుల చిప్పతోనేబయట కొచ్చిండు...

"ఇంకా తిండి కాలేదుర- తుడుం గొట్టపో... పంచాది మర్సినవా?". అన్నాడు..

ఇస్రూ నీళ్లు గటగట తాగి తుడుం తీసకొని బొగడమీది బంగళా దిక్కు పరుగెత్తాడు.

"టట్టర....టట్టర....టరటర....టరటర...."తుడుం మోగుతోంది గాభరగాభ రగాకాకుండా ఉండీ ఉండీ- గుడిసె గుడిసెకు మనిషిబోయి పిలిచినట్లుగా.... తుడుం మోగుతోంది. గోండు గుడిసెల్లో కలకలం.... ఒక్కొక్కరే - ఎముకలు తేలిన వాళ్ళు - చిరిగిన బట్టలవాళ్లు, కంపలోటి నెత్తులున్న స్త్రీలు - పిల్లల నెత్తుకొని ఒక్కొక్కరే బొగడమీద చేరుతండ్లు - తుడుంమోత వినవచ్చినంతమేరకు చుట్టు పక్కల గూడాలవాళ్లు ఆ ఊరికేసి నడువ సాగిండ్లు.

ఇక తూర్పుకు విస్తరించిన ఊళ్ళోని మరాఠా రైతులు, లంబాడీలు- తెల గలు గునుస్తూ, తిడుతూ, వాళ్ళు మందలు మందలుగా బొగడకేసి నడిచారు. ఊరు ప్రారంభమయ్యే దగ్గరి పెద్ద పెంకుటింట్లల్లోని మత్తేదారు అహమ్మదాలి "మీరేం గాభరాపడద్దు... డర్ నామత్...గోండువాల్లోంకా బాతోమే..." మాటమధ్యలోనే ఆపి గడ్డం తీడుకున్నాడు... ముఖం మీద అసహ్యంగా పేరిన నూనెకేసి చూస్తూ మరాఠీ రైతు శంభు, తెలుగురైతు నారాయణ తలలూపారు. వాళ్ళు కూడా బొగడకేసి నడిచారు....

"అంతయిపోయినంక క్యాంపు బెత్తనంటది సర్కారు .ఫిర్ఫాయిదా క్యాహై. ఉల్టావాళ్ళకి మేపలేక తోబా తోబా అయిపోతది.... తేరిమాకా యే పొర్కల పార్టీ వాలేంకో - కిందబెట్టినా పంచాదే - మీదబెడితే పంచాదే.... కాలం [illegible]గరాలే దేఖ్నా? తెరిమాకా యే జిరాతిమే బిల్కుల్..." ఇంకా ఏమాలోచించాడో...

"రహమతేక మా ఖులారహీ ... (రహమత్ అమ్మ పిలుస్తోంది. ముస్లిముల స్త్రీల పేరు వాడను) సన్ననిగొంతు. ఆలోచిస్తూ - లుంగీ మోకాళ్లదాకా ఎత్తిపట్టుకొని, స్లిప్పర్లు టకటకలాడిస్తూ పరదాలోపలికి నడిచాడు.

ఇక బొగడ దగ్గర దాదాపు అయిదువందలమందిదాకా జమయ్యారు. డుడుం ఆగిపోయింది. అక్కడ అంతమంది జమైనా బంగళాకు చెరోపక్క రెండు గ్రూపులుగా విడిపోయి జనం కూర్చున్నారు. ఒక పక్క గోండు వాళ్ళు ఆ ఊరివాళ్ళేకాక చుట్టుప్రక్కల గూడాల నుంచి వచ్చినవాళ్ళు కూర్చున్నారు...ఇంకా వచ్చేవాళ్లు వస్తూనే వున్నారు ఇంకొకపక్క మరాఠా, లంబాడా, తెలుగు గిరిజనేతరులు కూర్చున్నారు. గిరిజనేతరుల్లో కొద్దిగా భూవసతి గలిగినవాళ్లు మరీ దిగాలుపడి కూర్చున్నారు లంబాడీవాళ్ళ ముఖాల్లో ఏ భావమూ కన్పించడం లేదు.

అక్కడ ఇరుపక్షాలల్లో మోహరించి కూర్చున్నవాళ్లంతా ఎవరేం మాట్లాడుతున్నారో తెలువకుండా గొనుగుతున్నారు ఊరుపేరులేకుండా తిడుతున్నారు....

"అదికాదయ్యా .... ఒకటా రెండా ఒనరంగమూటా. నా కొంపముంచిండ్లు. నా ఇంటికగ్గి దలబెట్టిండ్లు.... ఇగో నా వొంట్లె గోరెడు మాంసం లేకుంట వొలుసుక తినుండ్లు - నా కొరగండ్లు నేను మీ గోంతు గుసిసెలముంగట ఉరిబెట్టుక సత్తం.," అన్నాడో పొట్టి రైతు అడికీడికీ తిరుగుతూ....

"సూడబోతే అంతేసురి, నోట్లే నాలికలేని గోండోళ్ళు తెగిచ్చిండ్లు, చేండ్లమీనపడి కోసకచ్చుకుంటే - మనకు తా గోదాట్లెబడదాం - గవర్నరు సర్కారుకు కండ్లుసల్లబడ్డయి, ఓర్నియ్యవ్వ పాపమా! అన్యాయమా? చేండ్లమీనబడి కోసుక పోవుడే?" నారాయణ మందిలో నుంచి ఎగేసిండు.

"మీరు మాత్రమే ఊకున్నారా?" ఎగోదిరావు...

ఆ మాట మీద రగడ లేచింది... అటునుండి ఇటు నుండి జనంలేచారు. ఒకరినొకరు తిట్టుకోసాగిండ్లు.. మరికొంతమంది దుబ్బను తన్నుతూ లేచివచ్చారు... ఎవడో మన్నుతీసుకొని" ఇగో మా పంటలు గోసుకొచ్చుకొని మా నోట్లె మట్టిగొట్టిండ్లు... ఆఖరుకు మీకు గీమన్నె మిగులుద్ది" అంటూ మట్టి కిందబడేశాడు...

గొండోల్లు రోషానికొచ్చిండ్లు... స్త్రీలు తిడుతున్నారు- చేతులు తిప్పుతూ అరుస్తున్నారు. అంతా మరికిగుడ్డలవాళ్లే... అంతా ఎముకలుతేలినవాళ్ళే- అంతా నిరు

పేదలే- కాని ఒకరినొకరు చంపుకుందామనుకున్నంత కోపంతో, కసితో ఒకరిమీది మరొకరు కాలు దువ్వుతున్నారు,

అప్పుడే పొరుగూరి నుంచి వచ్చిన భగవతిరావు ముఖంమీది చెమట తుడ్చుకున్నాడు ... ఊబ చెంపలు, చిన్నకండ్లు దొడ్డుపెదవులు.

"పంచాదు పెట్టుకొని కొట్లాడుతెల్ల-" అన్నాడు పెద్దబండమీదికెక్కి-కూర్చొంటి అన్నట్లు చేతులూపిండు....

"ఇంకేంది అల్ల గోండునాయకుడచ్చిండు... తుపాకి తెచ్చుకోలేదా?" పందిల నుంచి మరాతాళంఢు.

భగవతిరావు ఆ మాట పట్టించుకోకుండానే ముందు గిరిజనేతరులను గద్దువలు బట్టుకొని బతిమిలాడి కూర్చుండ బెట్టాడు. ఆ తరువాత గోండువాళ్ళను కూర్చుండ బెట్టాడు. అట్లా గోండులను శాంతపరుస్తూనే - తూర్పు, దక్షిణం వేపు తొవ్వలమీద కావలికోసం ఇద్దరు గోండుయువకులను పంపాడు. మరో ముసలివాన్ని, పిల్లవాన్ని అహమ్మదాలి ఇంటిదగ్గర కావలికి పంపాడు....

అప్పటికి సూర్యుడు నడినెత్తిమీదికి పాకుతున్నాడు. చేండ్లమీద తిరిగి తిరిగొచ్చిన గొర్రెంకలు తమ తావులయిన ఇప్పచెట్లమీద చేరాలనుకొనివచ్చి - అంత మందిని చూసి అల్లరిచేస్తూ పక్కలకు ఎగిరిపోతున్నాయి... ఎవడో బంగళాముందు నెగడిమొద్దులు సరిచేశాడు.. సన్నగా పొగలేచింది.

పొగపలుచబడ్డది... పడమటి గుట్టమీది నుంచి ముగ్గురు రావడం కనిపించింది....

"పొరకల సార్లత్తండ్లు - పొంకలసార్లు." గుసగుసలు... మాట్లాడుతున్న వాళ్లు మాటలాపిండ్లు- కొందరు లేచి లేచి వచ్చేవాళ్ళను చూసిండ్లు... మగ్గిరిలో ఒక తను కొద్దిగా ఎత్తు - ముగ్గురూ ధోవతులే కట్టుకున్నారు. మునక అంగీలేసుకున్నారు.

బంగళాముందుకొచ్చి ఎత్తుగా ఉన్నతను "రామ్.. రామ్.." చెప్పాడు.. "రామ్ .. రామ్" అన్నట్టుగ గోండువాళ్లు గొణిగారు. మిగతావాళ్ళు మూతులు ముడుచుకున్నారు ...

ఒక్కసారిగా సీరియస్‌గా మారిన వాతావరణాన్ని ఉల్లాసపరుస్తూ.. ఎత్తుగా ఉన్నతను.. "మృగశిరకార్తె మబ్బుల తీర్గున్నరు." అన్నాడు.. అట్లా అంటూనే

అందరికి కనిపించే విధంగా ఉండే జాగాను వెతుక్కొని ఓ బండమీద కూర్చున్నాడు. అతని వెంటవచ్చిన ఇద్దరు కొంచెం దూరం జరిగి చెరోవక్క విప్పచెట్లదగ్గర కూర్చున్నారు. ఊళ్ళనుంచి వచ్చేదారిమీద చూపులు నిలిపిచూస్తున్నారు.

గోండు వాళ్ల మంచినీళ్ళు తెచ్చియిచ్చారు... కొద్దిగా ముఖంమీద జల్లుకొని - మరికొన్ని తాగి - పక్కవాళ్ళ కిచ్చిండు.. మూతితుడుచుకుంటూ లేచి నిలబడిరెండు పక్కల కూర్చున్న జనాన్ని చూశాడు...

"ఇలాంటి సమయంలో మీటింగు బెట్టడం కష్టంగానే వున్నది" అని మళ్ళా "పేదలంతా ఒక పక్షంచేరి తాము ఇన్నేండ్లు పడ్డ బాధలకు కారణాలు దెలుసుకొని లడాయి చెయ్యాల్సిన సమయంలో - పేదలల్ల పేదలకే జగడం బుట్టింది... అగో అసొంటియాల్లల గీ పంచాతు. . నారాయణ పెద్దయ్య కాదంటవా?" అన్నాడు గిరిజనే తరులకేసి నడుస్తూ పొరకలసారు.

మందిలో కూర్చున్న నారాయణ ఔననలేదు కాదనలేదు. మళ్లీ పొరకలసారే కలగజేసుకొని

"సరే - ఎవరు ఏ వుద్దేశ్యంతోటి- పేదలకు పేదలకు, ఇక్కడంతా రైతులు కూకున్నరు గనక్క రైతులకు రైతులకు తాకులాట దెచ్చిండ్లో ఆ యింకమాట్లాడుకుంటాం. తగువైతే వచ్చింది... ఇది ఇప్పటి తగువుకాదని మీకెరికే... తగువెట్లా వొచ్చిందో మీరంతా ఎట్లాగు చెప్పుతరు- న్యాయమైన పద్ధతిలో.... మీకందరికీ అనుకూలమయిన పద్ధతిలో తగువు తీర్చుకుందామంటే.... తగువు తీర్తది, లేపోతే పెంచుకుంటే పెద్దగయితది. నష్టపోయేది మాత్రం ఇద్దరు. ఆ సంగతట్లా ఉంచుండ్లి..." తనొక్కడు మాత్రమే మాట్లాడుతున్నట్లు గమనించి- "మరింక చెప్పండి..." అంటూ బండమీద కూర్చున్నాడు...

"ముడ్డికింద మంటబెట్టి సుతిపట్టుమన్నటున్నది..." అన్నాడొక మరాఠీరైతు...

"ఔ... ఔ అట్లనే ఉన్నది..." అన్నాడింకొకడు...

"ఆళ్ళయితే పంటలు దెచ్చుకున్నరు..." మరొకడు..

"ఇండట్ల ఓరు మాత్రమ్ తక్కువ తిన్నరు." అన్నాడింకో గోండువాడు...

"అదికాదయ్యా..." భగవతిరావు పొరకల సారుకేసి చూసి-

"ఇగో- సార్ వార్ మూంతా (సమక్షంలో) నేను మూంతా.. నేను కొంత సంగతి చెప్పుదామని..."

260

"నువ్వేం జెప్పుతవో? మాకెర్కలేదా?" తెలుగురైతు అడ్డొచ్చాడు.

"ఔనయ్యా! ఏడినుంచో మా గూడాలల్లకు వత్తిరి... ఏదో మా సొమ్మేం గొంటబోతరు. మాతో బాటు బతుకుండ్లంటే, ఉన్న భూమంతా కబ్జా చేసుకుంటిరి... మమ్ముల దిక్కులేనోల్ల జేత్తిరి. ఆఖరుకత్తె" అంబతిరావనే గోండువాడు కోపంగా.

"అగో మీ వచ్చాన పౌరకల సార్లచ్చిండ్లుగదా? ఇంకేంది?" ఒక లంబాడా రైతు...

అప్పుడు పౌరకల సారు కల్పుగజేసుకొని "పంచాదుకన్న ముందు నేనోమాట జెప్పాలె.... పౌరకల పార్టీ ఏ వొక్కలద్దికాదు. మేం కేవలం గొండ్లోల్లకోసమే పని చేస్తున్నట్లు మరాఠా-తెలుగు, లంబాడా రైతులకు అన్పించవచ్చు. కాని మీరు కూసంత విచారం జేస్తే అది నిజం కాదని తెల్వుత్తది. కరీంనగరంల-మీ పక్కమైదాన ప్రాంతాలల్లో రైతుకూలి సంగాలు బెడ్తన్నం. దున్నేవానికి భూమి, నడిపేవానికి మిల్లు కావాలంటున్నం ఎవడైతే కష్టం చేత్తడో వాదే తనకష్ట ఫలితం అనుభవించా లంటున్నం..." ఇట్లా తమ పార్టీ ఎవరికోసం పనిచేస్తున్నదో ఈ దేశంలోని రైతాంగము,కార్మికవర్గం కలిసి కల్లే సర్కారును పడగొట్టి రాజ్యం గెలుచుకోవాలని,దున్నే వానికి భూమి చెందాలని పౌరకలసారు చాలాసేపు చెప్పుకొచ్చిండు.

పౌరకలసారు మాటలు ఎవరిమీద ఎట్లా ప్రభావం చూపాయో స్పష్టంగా తెలియలేదు... కాని కాసేపు ఎప్పటిలాగే ఇరుపక్షాలు మెల్లెగా మొదలుపెట్టి ఉద్రేకంగా ఒకరినొకరు తిట్టుకున్నారు. మీది తప్పంటే మీది తప్పనుకున్నారు... 'పేదల మైన మమ్ముల ఇప్పుడు భూముల్లనుంచి వెల్లగొడితే ఎట్లాబతికేది?' అని గిరిజనేతరు లన్నారు. "అసలుభూమి లేకుండా మా దగ్గరికి బతుకొచ్చి భూమంతా కబ్జా చేత్తిరి. మేమెట్లాబతుకాలే"నని గోండ్లన్నారు... "ఇప్పుడెట్లా బతుకుతున్నారో అటాగే" అన్నారు తెలుగలు. "మేం అట్లా బతుకదలుచుకోలే"దన్నారు గోండ్లు.

పొద్దు నెత్తిమీది కొచ్చింది, అమీతుమీ తేలలేదు. అసలు సమస్య తేలలేదు. ఒక్కొక్కరే మాట్లాడటంబోయి, ఎవరికి వారే బిగ్గరగా మాట్లాడుతున్నారు

పౌరకలసారు కల్పించుకొని "రెండు పక్షాలనుంచి ఎవరన్నా బాగాతెలిసినవారు చెప్పండి" అన్నాడు.



2)

మాటలు బందయినయ్-ముచ్చటాగినయ్. నువ్వు చెప్పమంటె నువ్వు చెప్ప మన్నారు.

గోండులనుంచి ఎగోదిరావు వంగిపోయిన తనువును నిటారుగా ఎత్తిండు ఏదో మాటలాడాలనుకున్నాడు. అతని కంఠం రుద్ధమైపోయింది. కండ్లపొంట నీల్లు కారినయ్. ఈ గడబిడలో అతనిచేను కోసుకపోయిండ్లు గిరిజనేతరులు. ఆ దుఃఖం అందుకరాదు—అతనికి తన జీవితకాలంలో భూమికోసం పడ్డ తిప్పలన్ని ఏక కాలంలో పోటెత్తాయి....

“సార్‌వార్ మాంతా.. భగవతిరావు మాంతా, ఇక్కడకూకున్న చిన్నలు పెద్దలు మాంతా... ఈ పూల్లె నా ఈడువాల్లు సాలె లచ్చుమయ్య, మరాఠీ బాబన్న తప్ప మరింకెవ్వలు లేరు. కాదు బాబన్న” అన్నాడు.

అప్పటిదాకా ఒక్కమాటన్నా మాటలాడకుండా కూర్చున్న మరాఠీ బాబన్న నెత్తిమీద గుడ్డటోపీ తీసి ఔనన్నటు తలూపిండు ...

“నాకేడ మతికిగని—ఇప్పటికి నలభయే అయ్యిందో? ఇంకా ఎక్కువే అయ్యిందో గని-మేం. మా గూడెంల గత్తరత్తె గూడెమిడిసి గీడికచ్చినం. గప్పుడు-గీడ నాలుగే గుడిసెలుండె - మేం అడివి నరుక్కున్నం. మూడేండ్లో, నాలుగేండ్లో నాకు గిప్పుడు మతికి లేదు మన హైదరాలీ పటేల్ తండ్రి లడ్డుపటేల్ గిదంత నా మక్త అంట అచ్చిండు. ఆడు తూడ త్తని బెదిరిచ్చి మేం కొట్టిన భూముల కబ్జ చేసుకున్నాడు. అగో గయినె మా గూడానికొచ్చిన మొదటి బయటిమనిషి. ఇగ ఆయినెకు పాలేర్లంట, పనిపాటలోల్లంట సానామంది వచ్చిండ్లు మేం జంగల్ నరుకుడు, గిది నా మక్తాలదనుడు. ఇగోగి బొగడమీన్నుంచి సూత్తే కనిపిచ్చే నూర్ల ఎకరాలన్నీ మా నెత్తురు కలికలిజేసి భూముల జేసినయే.

“అయింక నాలుగైదేండ్లకేమొ? మరాఠోల్లచ్చిండ్లు. మాసిన బట్టలతోని, అవ్వ అప్పం ఆయీ భాయి అనుకుంటచ్చిండ్లు తురక మత్తెదారు సందుజెట్టలే- మా భూములు బోయినయన్నరు. జాగలు బోయినయన్నరు. దేశంగాని దేశం పచ్చుల తీరచ్చిన మన్నరు. మాదేం కొంటబోతండ్లు. రెక్కలున్నయి-మీరున్నరు అడివి- నరుకోక్కండ్లి బతుకుండ్లి, అన్నం మాగోండ్లం.

ఆళ్ళు - ఆడేడనో బట్టలు తయారై తయన్నరు. పత్తివంట ఏసుడుబెట్టిండ్లు మమ్ముల జూత్తెనే అగ్గిలబడే మక్తెదారుకు మరాటోల్లకు మంచి దోస్తానయ్యింది. యాడినుంచో ఇగో లంబడోల్లచ్చిండ్లు ఊరు పెరిగిపోయింది. భూముల్లు సాపయినయి. వచ్చేటోల్లు ఇంకా వస్తనేఉన్నరు. గొండోని బతుకు ఎటుగాకుంట తెల్లయిపోయింది. మరింక కొత్తగ బూములు నరుకుదామంటే జంగలాతోల్లచ్చి మా బూములన్ని రిజర్వుల కచ్చినయన్నరు. అప్పుడు షురవయింది గొండోనికి...." ముసలి ఎగోదరావు కంఠం ఎండుకపోయింది. మరింక మాట్లాడలేకపోయాడు.

"ముసలోడెప్పుడు చెప్పేదే?" అన్నాడో గోండువాడు.

అప్పుడు పొరుగుగూడెం భగవతిరావు కలుగజేసుకొని "ఇప్పటికి పదేండ్ల కింద [1] లగంధారీ పట్టాలంట గోండోల కచ్చినయ్....ఇరువై ఏండ్ల కింద ఎవడు యేయే నంబరు దున్నిండో లెక్కలు దీసిండ్లు. తలాకొంత రాసిండ్లు. అగో గప్పుడే గొండోల్లకు ఆశ బుట్టింది. గిర్దవార్ల సుట్టు, పట్వార్ల సుట్టు సద్దులు గట్టుకొని తిరిగితిరిగి సచ్చిండ్లు—"

"దాన్నే పెనస్సీ అంటారు" పొరకలసారు.

"గదేందో మా కేమెరుకగని-గప్పుడు మల్ల భూమిమీద ఆశలు బుట్టినయ్. మక్తేదార్లు తమకింద ఉంచుకునేకాడికి ఉంచుకొని మా పేరుమీద పట్టాలిచ్చిన బూమి మాత్రం లంబడోల్లకు, మరాఠోల్లకు అమ్ముకున్నరు...."

మరాఠీ ముసలి బాబన్న కలుగచేసుకొని "ఇదిగో మా దగ్గెరి నుంచి మక్తెదారు డబ్బు గుంజిండు. ఎకరాకు నూరే అన్నడు. కొన్నంక అధికార్లు గివి మీయి కావన్నరు. ఆళ్ళకు తడిపితిం. జంగలాతోల్లు గిది రిజర్వు అనిరి. ఆళ్ళకు తడిపితిమి. అఖరుక్కు ఇబ్బడి ముబ్బడయ్యె. సిక్కులట్లనే ఉండె - సొల్ల తవుడుబోసి కుక్కలకు తాకులాట బెట్టినట్టయ్యె" అన్నాడు.

"మనమర్జీల మనం యిచ్చినం, గింద్లట్ల మక్తేదార్ల తప్పేమున్నది"నారాయణ వెనకేసుకొచ్చాడు.

---

1. లగంధారీ పట్టాలంటే పెనస్సీయాక్టు దీనిప్రకారంగా 1953, 1954 లో యేయే భూమి రైతులు కాస్తు చేసిండ్లో ఆయా భూములు ఆ రైతులకే చెందాలని, ఇది 1874లో వచ్చినట్లు చెప్తారు.

చాలామంది నారాయణమీదికి గయ్యిమని లేచిండ్లు.

"ఏమయితేంది గోండోల్లు పరెషాన్ల బడ్డరు. పట్టాలచ్చినయని దున్నబోతే. తన్నులు గుద్దులు - జేల్లు - నామట్టుకు నేను నెలరోజుల నిజామాబాదుల జేల్లుంటే ఇంటి కచ్చేటాల్లకు పంచి నాగలిమీది కంకను (ఎద్దును) పులి గొట్టింది"—కుర్దు.

"మల్ల మొదటికచ్చింది కొట్లాట ... రామనేశుని కాడయ్యింది" ఒక తెలుగు రైతు.

"భూములమీద ఆశ లొదులుకొని జంగలాతోల్లతోనీ తన్నులు గుద్దులు తిను కుంటుండగనే మా లొద్దుల్లకు పౌరకలసార్లచ్చిండ్లు, భగవతిరావు ఆగి"వ.శ్యా ఆశ, మేమెక్కడ పౌరకలసార్ల మాట వింటమోనని - [2] గిరిజనుల భూములు గిరి జనులకే అంట చట్టాలు తెచ్చిండ్లు" భగవతిరావు.

పౌరకలసారు లేచి నిలబడి "మల్ల గిరిజనేతరులు హైకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్నారు. మొదటినుంచి కల్లేసర్కారు.ఇదే ఆట. ఒకనిదగ్గరనుంచి తినేకంచం గుంజి ఇంకోని దగ్గర బెట్టుడు. ఆడు మొత్తుకుంటే పుళ్కిటుబెట్టుడు.అసలే ఆ కంచంల పిరికెడు బువ్వ....కుప్పలు కుప్పలు. నూర్ల ఎకరాలు కబ్జాచేసుకున్న మక్తేదార్ల నేమనరు. ఆ పేదవానిది ఈ పేదవానికి, ఈ పేదవానిది ఆ పేదవానికి మార్చి-ఇద్దరికీ లడాయిబెట్టుడు.మక్తాదార్ల పక్కలచేరి కొట్లాడంటే చూసుడు.1979వరకు మల్లా గిరిజన గిరిజనేతర కొట్లాట ముదిరింది. అప్పుడు రైతుకూలి సంఘాలు కల్పించుకొని నిరుడు ఇదేబొగడమీద ఏం మాటాడుకున్నం? పేదవాళ్ళు పేదవాళ్ళు కొటాడుకోవద్దని-ఒకే భూమి గిరిజనునికి, పేద గిరిజనేతరునికి ఉంటే చెరిసగం పంచుకోవాలని చెప్పింది. మడావిబంగు, శంభు లాంటోల్లు అట్లా తప్పా చేసుకున్నరుకూడా." పౌరకలసారు కొద్దిగా కంఠంపెంచి "ఓ రైతులారా! మనంమనం ఎప్పుడు కొట్టుకసావటమే మక్తే దార్లకు, వాళ్ళ సర్కారుకు గావాలె-ఇగో ఈ బొగడమీంచి సూత్తే అట్టా ఆకాశపు అంచుదాకా ఉన్న భూములన్నీ చూడుండ్లి. ఆ భూములన్నీ ఎవరిచేతుల్లఉన్నాయి.... మీ వూల్లో లెక్కలు దీత్తే అంతా కలిపితే గోండ్లకు, మరాఠా, తెలుగు, లంబాడా రైతులంతా కలిపితే 150 ఎకరాల భూమిలేదు. మొత్తం ఊరిఆయకట్టు భూమంత దాదాపు 500 ఎకరాలు మీవూరు షివారు కిందున్నది. 150 ఎకరాలు అహమ్మదాలీ

---

[2] (గిరిజనుల భూములు గిరిజనులకే ననే చట్టం 1979లో చేశారు.)

కిందనే ఉన్నది. మిగతాది రిజర్వుఫారెస్టు కింద ఉన్నది. ఆ భూమంతా పేదగిరిజన గిరిజనేతరులు తీసుకోవాలి. కాని ఆ భూమంతా మస్తేదార్లు, సర్కారు ఉక్కు పిడికిలి కింద ఉన్నది. దాన్ని మీరంతా కలిస్తేతప్ప బద్దలు కొట్టలేరు. దాన్ని పోరాడి గెలుచుకుంటేతప్ప ఈఊళ్లోని దున్నేరైతుకు భూమి దక్కదు. అహమ్మదాలిభూమిని బేషరతుగా ఆక్రమించుకుందాం. కావాలిస్తే తను మనలాగా దున్నదలిస్తే అతన్ని దున్నుకోని బతుకుమందాం, సర్కారు పెంచిన పిచ్చితుమ్మలు నరికి పంటలు పెడుదాం. పోరకలపార్టీ మీవెంట ఉంటుంది. ఇగో ఇదేమాట. నిరుడు ఇక్కడే చెప్పాను. అందరూ తలలూపిండ్లు. మస్తేదారు భూమి 10 ఎకరాలు దున్నిండ్లు. మీరు ఏకమైనందుకే వాడు గగ్గోలయిండు-పెద్దల గల్పిండు."

"లోటీసులు పంపలేదా?" లంబాడా రైతు.

"కలెక్టరు నోటీసులు గిరిజనుల తరపున గిరిజనులభూమి గిరిజనేతరులు ఖాళీచెయ్యాలని పంపాడు"

ఈ మాటమీద మళ్ళీ రగడ లేచింది. "మాతో కల్సి ఉండుకుంటనే మా ముడ్డికిందికి నీళ్ల దెచ్చిండ్లు" గిరిజనేతరులు.

"మల్ల మస్తేదారు దగ్గరికే మీరురుకలేదా?" గోండ్లు.

"గిరిజనులమీద గిరిజనేతరులకు అనుమానం పుట్టింది. మళ్లా మస్తేదార్ల దగ్గరికే వాళ్ళు పోయారు. అడుగు బెట్టాల్నంటే భయపడేటోల్లు మనదాంట్ల రెండు కాంగనే పోలీసుక్యాంపచ్చింది. గిరిజనులకు పోలీసుల దెచ్చిండ్లని కోపం - అది ముదిరింది, పెరిగింది. వారంరోజులకింద ఎటుపోతున్నామో తెలియకుండ ఒకరిపంట మరొకరు కోసుకొచ్చుకున్నారు. వాడు వల విసిరిండు. మనం ఒకరిమీద కోపంతో ఇంకోరం వానివలలో పడ్డాం. ఇకనైనా మించిపోయింది లేదు. కామ్రేడ్స్! భగవతి రావు మీతోపాటు ఉంటాడు. న్యాయంగా పేదలభూములు తిరిగి పంచుకోండి. కోసుకొచ్చిన పంట పంచుకోండ్లి. మనమంతా కలిసి అడివి నరుకుదాం-తుడుం గొడుదాం. కల్లె రాజ్యం అంతమయ్యేదాకా, దున్నేవానికి భూమి వచ్చేదాకా—" పోరకలసారు సాయంత్రమయ్యేదాకా అందరితో మాట్లాడాడు.

○ ○ ○

వారంరోజుల తరువాత అహమ్మదాలి 'తన మొక్కజొన్నపంట కోసుకుపోయారని' ఆదిలాబాదుకు యస్. పి. దగ్గరికి పరిగెత్తాడు. "రిజర్వు ఫారెస్టు పిచ్చెత్తినట్టు నరుకుతున్నారని - నివారించడానికి వెళితే గిరిజనులు తపుగుడ్డలు ఊడదీసి, ముక్కులు భూమికి రాకిస్తున్నారని, తమకు తగినరక్షణ కల్పించకపోతే గూడాలల్లోకి వెళ్ళలేమని" ఫారెస్టు ఉద్యోగులు యస్. పి. దగ్గర చెప్పుకున్నారు.

## 2

తొవ్వ దారి లేని ఆ మారుమూల గ్రామానికి కచ్చారోడ్డుదిగి దానివెనుక గోలుసులు కొట్టుకుంటుండగా లారీ సాగిపోతోంది. రోడ్డు కిరుపక్కల చుక్కలకంటా పెరిగిన చెట్లకొమ్మలు లారీని గీరుతున్నాయి. క్యాబిన్‌లో ఎదురుచూపులు చూస్తూ దారి చూయిస్తున్న కంట్రాక్టరు మార్వాడీ చున్నిలాల్‌కు కుదుపునికో మరెందుకోగాని దిగచెమటలు కారుతున్నాయి. నుదురుకు బెట్టుకున్న కుంకుంబొట్టు ఎర్రగా ముక్కుమీదికంటా కారింది.

"హజారో రూపియా జంగల్లో ఫోస్తి. ఎకరాకు ఆరునూర్లిచ్చి భూమికొంటే లారీ కిరాయిలాయె జెర ఆయిస్తా ఆయిస్తా, బాయే" గొనుగుతూ చెమట తుడుచుకుంటూ, దారి చూయిస్తున్నాడు చున్నీలాల్.

"మల్ల కిరాయికొస్తె వొట్టు సార్... టైర్లు రాళ్ళల్ల సత్తెనాశనం అయిపోతన్నయి సార్. ఇంతకన్న బొంగు కొట్టుకుంటె ఫాయిదా!" డ్రైవరు.

క్లీనరు కునికిపాట్లు పడుతున్నాడు. అట్లా లారీ డొంకలుతిరుగుతూ, ఎత్తు పంపు లెక్కుతూ మేడిగూడెం ఊళ్ళో సొచ్చింది.

"జల్దీ పోనియ్. తెరిపూకా గోండువాలే ఆయేతో కిరికిరి" చున్నిలాల్ గాభరాగా అని అద్దం గుండా లారీలోపలికి చూశాడు. లోడింగుకోసం ఆదిలాబాదునుండి పట్టుకొచ్చిన లేబరు బాడీలో నిలబడి ఊరును చూస్తున్నారు.

"బైటో....బైట్‌రే"....చున్నిలాల్ కసురుకున్నాడు లేబరు ఆ మాట కాతరు చేయనేలేదు.

లారీ చుట్టు బిలబిల గోండోల్లు మూగనేమూగారు. డ్రైవరు హారను మోగిస్తూ ఊరు దాటించి బీడుభూముల్లోకి తోలాడు.

గుట్టదాకా విస్తరించిన బీడుభూముల్లో మాంగనీసు పర్మాలు (తనుసులు) కుప్పలు కుప్పలుగా-పర్మా కొలతకోసం ఉపయోగించే చెక్క పెట్టెలు - ఆ కుప్పల మధ్య అల్లిబిల్లిగా తవ్విన గుంటలు....

చున్నీలాల్ లారీదిగి "దిగండిరా? దిగండి....లారీ లోడు క్షేమంగా ఆదిలాబాదుకు చేరిస్తే మనిషికో రూపాయి ఎక్కువిస్త" అన్నాడు.

"అబ్బో మీరిచ్చే రూపాయిబెడ్తె లారెడు సామానత్తది బాంచెన్" అన్నాడొకడు కిసకిస నవ్వుతూ.

"ఎంత పరాష్కమాడితె మాత్రం మార్వాడిసేట్ పైసలసంగతి మర్సిపోతడా?" అన్నా డింకొకడు.

ఆ మాటలేవి పట్టించుకోకుండా చున్నీలాల్ ఊనుకేసి పైజమా సదురుకుంటూ బెదురుబెదురుగా చూస్తూనే ఉన్నాడు.

లేబర్ తట్టలు, పారలు తీసుకొని ఒక మాంగనీసు కుప్పదగ్గరికి కదిలారు. చున్నీలాల్ భయపడ్డట్టే అయ్యింది. ఊళ్ళెనుంచి కర్రలు, గుతుపలు పట్టుకొని జనం లారీదగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

"అచ్చాభై....పై మామూలి అసామి నహీ. మీరు పర్మా ఒక్కటికి 27 రూపాయలు పడదన్నరు. అంతకన్నా ఎక్కువిచ్చే స్తోమత నాకులేదు. ఇదేంది మట్టి? మీరు సమ్మె జేసుండ్రు. చేసుకోండ్రి - నాకీ పనిగి బాటులేదు. మరింక మీ మాంగనీసొద్దు, మన్నొద్దు. నా జాగల నేనుపోత. ఏదో ఎకరాన అరుసూర్లు బోసి - మీకు పర్మాకు 27 రూపాయలిచ్చి నాడబ్బంత మన్నుల బోషిన. మరింక తవ్వింది తీసుక పోసియ్యండ్రి" అన్నాడు.

"మేం ఎన్నేండ్లనుంచి తవ్వుతున్నం. భార్యాభర్తలు కలిసి ఈ మన్నుల మన్నయితే దినానికి నాలుగురూపాయలు కులి గిత్తలేదు. కూలి పెంచమన్నం" ఒక ముసలి గోండువాడు

"నాకు పత్తల్ లేదు భై."

"ఆదిలబాదుల బిల్డింగు కట్టలేదా? పత్త లెట్లలేదు" ఒక మరాఠీ యువకుడు మీదిమీది కొచ్చాడు.

267

గలాట ముదిరిపోయింది. "మాకింకా 30 పర్మాలకు పైకం రావాలె. అది కక్కు - మా భూములన్నీ పొక్కలు గొట్టిచ్చి చెడగొట్టావు. మరింక ఇక్కడినుంచి ఒక్క పెళ్ళ కదలటానికి వీల్లేదు" అరుపులు.

చున్నీలాల్ రెచ్చిపోయాడు. చిరుబొజ్జ కిందికి మీదికి కదులుతుండగా ఎగిరెగిరి తిట్టసాగిండు. చెమటలు కారి ఒళ్ళంతా తడిసిపోయింది.

"ఎత్తండిరా" చున్నీలాల్ కేకపెట్టాడు.

గోండులు, మరాఠీలు ఎగబడి తట్టలు, పారలు గుంజుకున్నరు.

"వీడో దొంగ - మా రక్తం ఎత్తుకపోయి బాగా సంపాయించిండు. మమ్ముల ముంచిపోయిండు. ఈడిమాల్ (సరుకు) ఎత్తుకపోదామని వచ్చిండు రామ్‌రామ్ డ్రైవర్‌సాబ్ - మీరెల్లుండ్లి - లేదంటిరా మీ లారీ మీరుండరు" అన్నారు.

మరికొంతసేపు ఘర్షణ జరిగింది. చున్నీలాల్‌కు పిచ్చెత్తింది. కోపంగా చేతులు విసురుతూ మందిమీది కురికాడు ఎవరో చేతులు నెట్టేశారు. ఇంకెవరో అంగి చింపారు. డ్రైవరు జనాన్ని ఆపి చున్నీలాల్‌ను లారీలో కుదేసుకుని వచ్చిన దారి పట్టాడు.

లారీ డబడబ లాడటంకన్నా మిన్నగా చున్నీలాల్ తిడుతూనే ఉన్నాడు. ఎన్ని వేల రూపాయలు లాసో లెక్కలు కడుతున్నాడు. అతనికి లారీ కిరాయికూడా యివ్వాలని తోచింది. ఎంతమంది వచ్చిండ్లు - ఇన్నూరో, మున్నూరో? ఇంకా తుడుం కొడితే ఎంతమందైనా రావచ్చు. పౌరకలసార్లు నా కొంప ముంచిండ్లు.... పౌరకలసార్లు రాకముందు ఎంత తనిచ్చిందో లెక్కలు తెలువని గోండ్లు - ఇప్పుడు అన్నీ అన్నీ లెక్కలు కడుతున్నారు.

ఆదిలాబాదు వచ్చేసరికి కరంటుబుగ్గ లెలిగినయ్. అదే లారీని సీదా యస్. పి. ఇంటిముందుకు తీసుకెళ్ళాడు. చిరిగిన బట్టలతో అలాంటిస్థితిలో చున్నీలాల్‌నుచూసి, అతని బిజినెస్ తెలిసిన యస్. పి. కి అంతా అర్థమయ్యింది.

"మీరు మత్తెదార్లస్తె మదత్ (సహాయం) చేస్తరు. హైకోర్టులనుంచి స్టేలు తెప్పిస్తరు. అప్‌కారోల్లొస్తే మదత్ చేస్తరు. పోలీసుల వంపుతరు. మా వ్యాపారస్తుల అన్నీ వ్యాపారాలకు దెబ్బొచ్చింది. పత్తి గిట్టుబాటు ధరంటరు." చున్నీలాల్ చాలా సేపు చెప్పి చెప్పి హఠాత్తుగా లేచి కాళ్ళీడిస్తూ వెళ్ళిపోయాడు.

268

# 3

రెండు కొండలమధ్య సాత్నాల ప్రాజెక్టు-దాదాపు పూర్తి కావొస్తోంది. ఇంకా ప్రాజెక్టు ధారకు అడ్డకట్ట కట్టడం మాత్రమే మిగిలిపోయింది. అదికూడా పూర్తి చేసేటందుకు మేస్త్రీలు వచ్చారు. తోయగూడెం, సాత్నాల మాంగూరు జనం తుడుం గొట్టారు. వేల సంఖ్యలో జనం పోగయ్యారు. సాత్నాల ప్రాజెక్టు కింద మునిగి పోతున్న తమ భూములకు నష్టపరిహారం చెల్లించేదాకా అడ్డకట్ట కట్టడానికి వీల్లేదన్నారు. మేస్త్రీలు తెల్ల మొఖాలు వేసుకొని చెట్ల కింద గుడ్డలు పరుచుకొని కూర్చున్నారు. జనం అక్కడే చెట్ల నీడలకింద అరుస్తూ కేకలుపెడుతూ తిరుగుతున్నారు.

కంట్రాక్టర్లు చేసేదేమిలేక కలెక్టరు దగ్గరికి పరుగెత్తారు. కలెక్టరుకు గోండు ప్రాంతాలల్లోకి పోవాలంటేనే భయం....తనను ఇదివరకు నిలదీశారు. ప్రశ్నల వర్షం కురిపించారు. తను మాత్రం ఏం చేయగలడు? ఆ ప్రాంతాలల్లో భూములు కోల్పోయిన రైతులకు ఏమని జవాబు చెప్పగలడు? కనిపించే భయంకర దరిద్రాన్ని కాదని-తను తీర్చగలనని హామీ యివ్వగలడా? తను పోవాలి. ప్రభుత్వం తరపున అబద్ధాలాడాలి....వెళ్ళినంత కాలం వెల్లదీయాలి....ఏది ఏమైన నక్సలైట్ల నుంచి జనాన్ని ప్రభుత్వంకేసి తిప్పాలి....జీబులో కూసున్నాడు.

కలెక్టరు ఒక సర్కిల్‌ను, ఏడుగురు పోలీసులను వెంటబెట్టుకొని మిట్ట మధ్యాహ్నానికల్లా సాత్నాల చేరుకున్నాడు.

అతని జీబు చుట్టూ ఇసుకవేస్తే రాలకుండా జనం మూగిపోయారు....కలెక్టరు జీబులో నుంచి దిగాలా వద్దా అని విచారం చేస్తుండగానే సర్కిల్ దిగి పిస్తోలుమీద చేయుంచి ఆ చిరిగిన గుడ్డల జనంలో వెతుకుతున్నాడు.... తనకు కావాల్సిన ముఖాల కోసం. కాని అందరి ముఖాలు క్రోధంతో మండుతున్నాయి.

"ప్రజలారా! మన ప్రభుత్వం మీకోసం కోట్ల రూపాయలు ఖర్చుబెట్టి ప్రాజెక్టులు కట్టిస్తోంది...." కలెక్టరు దిగి భుజాలు ఎగరేసి అన్నాడు....

"ఔ సారు....మేం వరదలొచ్చి కొంపగోడు కొట్టుకపోయి తిండిలేక మల మల మాడుతంటే ఏ కల్లే సర్కారు మా గూడేల దిక్కు తొంగి చూడలేదు...."

269

ఓ గోండువాడు మందిలోనుంచి "మీ ప్రాజెక్టు మీరే తీసుకోండ్లి- మా భూముల మునిగిపోతయి-జైన ఊల్లోని తురక,రెడ్డి, వెలమ మక్తెదార్లకు కాలువలుదీసి నీళ్ళు కొంటబోతరు...." ఒక స్త్రీ....

సర్కిల్ ఆ స్త్రీని ఎగాదిగా చూసిండు. ఆదిలాబాదు గిరిజన సభలో ఆ స్త్రీ గొంతెత్తి పాటలు పాడడం తనకు గుర్తున్నది ...

"పౌరకలసార్లు మీకు మాయమాటలు చెప్పుతున్నారు. మీరు వినవద్దు. సర్కారు మీకు అన్నీ యిస్తది." కలెక్టరు ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు....

కాని ఆ మాటమీద వెనుక ఎక్కడో ఉన్న అంబతిరావు ముందుకు వచ్చి "సర్కారా? అన్ని యిస్తదా? గుడిసెలే సక్కగలేవు. అడివిల వాసం పెందెముడితె గుడిసెపట్టి (పన్ను) లావ్‌లావ్ మంటడు మీ సర్కారు సైకిదారు. మీరు పెంకలస్త మంటరు. నెత్తిల కప్పుకోనా? మీరు మేకలిస్తే జంగ్లాతు అమీను కోస్కతినకొంట బోతడు. మీరు పట్టాలిస్తనని మాతోనంటరు. మక్తేదార్లకు అథాలతుల కాయిదా లిస్తరు....మీ సర్కారిచ్చే ఇనాములు ఇందర్‌వెల్లిన చూస్తిమి. కలెక్టర్ సార్ మీకు రామ్‌రామ్. మాకు మీదేదివద్దు. మా భూములకు నట్టం యియ్యండ్లి" అనేసి మళ్ళీ మందిలోకి వెళ్ళిపోయాడు.

"సర్కారు అన్నీ యిచ్చేదైతె సర్కిల్‌సాబ్ నెందుకు తెస్తది....మా కోసం పౌరకలసార్లు సావమన్న సస్తరు—వాళ్ళ మాట వినవద్దా?" మందిలో ఎవడన్నాడో తెలియకుండా ఒక గొంతు—

సర్కిల్ ఉరిమి చూశాడు. పిస్తోలు తీశాడు. అడుగు ముందుకు వేశాడు. అతనికి చిరాకుగా ఉన్నది...కలెక్టరు అంత శాంతంగా మాట్లాడుతున్నందుకు కోపంగా ఉన్నది. తనకు తెలిసిందల్లా తన్నడం—

కలెక్టరు కనుబొమ్మలు ముడుచుకున్నాయి. అందరితో మాట్లాడితె ఎంతకూ ఎడతెగదు—

"మీకు నష్టపరిహారం తప్పకుండా యిస్తాం—మార్చి నెల అఖరులోగా అందరికి చెల్లిస్తాం—ఎవరెవరి భూమి ప్రాజెక్టుకింద పోతున్నదో ఇంకా లెక్కలు పూర్తి కాలేదు—నేను మీకందరికి హామీ యిస్తున్నాను. ఈ ఒక్కమాట వినండి. ప్రాజెక్టు పని నడవనీయండి." కలెక్టరు చెప్పవలసింది చెప్పి జీబు ఎక్కాడు.

జనంలో గుసగుసలు—ఒక ముసలివాడు అందరి తరఫున వచ్చి "సరే—" నన్నాడు.

కలెక్టరు జీబు కదిలింది—మేస్త్రీలు చెట్లకింది నుంచి లేచారు—

o o o o

270

# 4

ఒకనాడు యస్.పి. ఆఫీసులో కూర్చున్నాడు.... స్టెనోని పిలిచాడు.

"అదిలాబాద్ అడివి ప్రాంతాలల్లో గోండులు తీవ్రవాదుల మాటలనుపూర్తిగా నమ్ముతున్నట్లు ఇంటెలిజెన్సు శాఖవారు చెప్పుతున్నారు. రెండు సాయుధ దళాలు గోండు గూడాలల్లో తిరుగుతున్నట్లు- ఆ దళాలల్లో ఏడుగురు సభ్యుల చొప్పున ఉన్నట్టు, అందరిదగ్గర తుపాకులున్నట్లు పోలీసుశాఖ అనుమానిస్తోంది. బాది అనే ఊళ్ళో దాదాపు మూడువందల ఎకరాల రిజర్వుఫారెస్టు నరికినట్లు ఫారెస్టు అధికార్లు చెప్పుతున్నారు. అడ్డగించబోయిన సారెదార్లను, చౌకిదార్లను గుడ్డలువిప్పి ముక్కు- భూమికి రాకిస్తున్నారట-మక్తెదార్లు తమ ఊళ్ళల్లో క్యాంపులు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారు....తోయగూడలో భూస్వామి భయపడుతున్నాడు. మాంగనీసు పని నిలిచిపోయింది. ఇంకొకపక్క- కరువుపరిస్థితి. భూస్వాముల పంటలుకోసుకపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పెట్రోలింగు చేయించాలంటే చాలినంత ఫోర్సులేదు. వాహనాలు లేవు....ప్రభుత్వము తీవ్రమైన శాంతి భద్రతల సమస్యగా పరిగనించి అదనపు బలాలు పంపవల్సిందిగా విన్నపము....దాదాపుగా నెలరోజులుగా ఏ అధికారి అడివిలోకి వెళ్ళలేకపోయాడు...." ఇట్లా చెప్పి సిగరెట్టుముట్టించాడు....కాసేపు మౌనంగా గదిలోపచారు చేశాడు.... టక్ టక్ .... తుడుం సంగతి రాయాలి. ఇప్పటికే సి.ఆర్.పి పంపామంటారేమో?గిరిజనులు కర్రలతో దాడికి సిద్ధపడుతున్నట్లు రాయించాలి.... మళ్ళీ మనసు మార్చుకున్నాడు....కాసేపు మౌనంగా నిలుచుండి బయటకు చూశాడు. బయట ఎండ-తనకు ఉక్క-పోస్తున్నట్టనిపించింది. "రాస్కెల్స్" అన్నాడు.... స్టెనోను బెల్ నొక్కమన్నాడు. బయటినుంచి యస్.ఐ వచ్చి పోలీసు సాల్యూట్ చేశాడు. ఏర్ కూలర్ ఆన్ చేయమన్నాడు. యస్.ఐ ముఖం అటు తిప్పుకుని కూలర్ ఆన్‌చేసి బయటకు పోయాడు.

"చింపేయి"అన్నాడు యస్.పి....

"యూకెన్‌గో....", స్టెనో కాగితం చింపేసి వెళ్ళిపోయాడు.

మళ్ళీ కుర్చీలోవచ్చి కూర్చున్నాడు....గబాగబా ఫైళ్ళు తీసిఏదో వెతికాడు. నాగపూర్‌లో జరిగిన అంతరాష్ట్ర పోలీసు అధికార్ల కాన్ఫరెన్సుకు సంబంధించిన రిపోర్టుతీసి చదివాడు.... టేబుల్‌మీది మ్యాపు గీతలు చూస్తూ చాలా సేపుకూర్చు

న్నాడు. తరువాత వైర్‌లెస్ అపరేటర్ని పిలిచి—"నా యూకెన్‌గో" అన్నాడు.

ఆ తరువాత ఫోనుచేసి సర్కిల్సును, యస్.ఐ.ని పిలిచాడు.

ఇప్పుడు కొంచెం స్థిమితంగా అన్పించింది....మ్యాప్‌లో ఊళ్ల చూశాడు.... దళాలకు సప్లయిలు ఎక్కడినుంచి వస్తున్నట్లు? అసిఫాబాదు-చెన్నూరు-ఆదిలాబాదు మూడుచోట్ల పెద్దఎత్తున ఫోర్సు పెట్టాలనుకున్నాడు. తర్వాత వార్తాపత్రికలు తిర గేశాడు....మంత్రిమండలిలో నక్సలైటు....యస్.పి. కనీకనిపించకుండానవ్వాడు పోలీసాఫీసర్ల బదిలీలు....లాంగోవాలా గురించి మరేమిటో?

బూట్లచప్పుడు....పేపరులోనుంచితలెత్తలేదు. పోలీసులు సాల్యూట్లుచేస్తున్న ట్లుగా బూట్లచప్పుడు. ఎ.యస్.పి సర్కిల్ రెడ్డి, అన్నీ తెలుస్తూనేఉన్నాయి. టేబుల్ ముందు వాళ్లుకూర్చున్నట్లుగా కుర్చీలు కిటకిటలాడాయి. అంతా ఎనిమిదిమంది. యస్.ఐలు ఇరుకిరుకుగా కూర్చున్నారు బెంచీమీద.

"సో...." అంటూ పేపరు టేబుల్‌మీద పెట్టాడు.

ఏకధాటిగా తనిందాక స్టెనోకు చెప్పిన విషయాన్నే తన అధికారి భాషలో చెప్పాడు.

"సార్ మనం పెట్రోలింగును తీవ్రం చెయ్యాలి."ముద్దగా ఉన్నసర్కిల్. యస్. పి తలూపాడు.

"అనుమానం ఉన్నవాన్నల్లా అరెస్టు చేయాలి." ఇంకో యస్. ఐ.

"చేస్తం..అరెస్టులు చేస్తం. అవసరమైతే కాల్పులుచేస్తం. కానిఇంద్ర వెల్లి ని ఎంత ప్రచారంచేశారు....ప్రభుత్వం ఇప్పుడు ఏం చేయాలనుకుంటోందో తెలుసా?" చెప్పమన్నట్లు ఎ.ఎస్.పికేసి చూశాడు. అతని మనసులో పార్లమెంటు ఎలక్షన్లు మెదిలాయి....

"తీవ్రవాదులనుంచి జనాన్ని తప్పించాలనుకుంటోంది.... గ్రామోదయ కార్య క్రమాలు తీసుకుంటోంది. వరంగల్ భట్‌పెల్లి,మల్లారెడ్డిపల్లెలో కలెక్టరు యస్.పి- మీటింగు బెట్టారు...."

"ఆదివాళ్లు నమ్ముతున్నారా?" అని అడుగాలనుకున్న సర్కిల్ అది అంత మంచిదికాదనుకున్నాడు. యస్.పి-ఇదే యస్,పి రాత్రికిఫోనుచేసి పెట్రోలింగుకు పొమ్మనవచ్చు కాని అదే మాటకింది అధికారి అనొద్దు.

ఇంతలోనే వైర్‌లెస్ మెసేజొచ్చింది....భువనేశ్వర్ నుంచి పంపిన అద నపు సిఆర్‌పి బలగాలను అవసరమైతే చెన్నూరు నుంచి రప్పించుకొమ్మని. చెప్పా చెయ్యకుండానే యస్.పి.-లేచి బయటకొచ్చి జీపెక్కిండు.... అధికార్లులేచారు.

272

o o o o

తెల్లారి ఏడుగంటలకే లోకారికేసి పెట్రోలింగుకు పొమ్మని సర్కిల్‌కు యస్.పి ఫోనుచేసిండు....

# 5

తొమ్మిది గంటలు కావస్తోంది. రెండు పాలపిట్ట రంగు వ్యాన్లు, వాటి వెనుక ఒక జీబు ఆదిలాబాదునుండి బయలుదేరి లొద్దిగూండా - చెట్లకిందిగుండా తంతోలి ఊరు దాటినయ్.

రెండు వ్యాన్లల్లో పోలీసులు తుపాకులకు గద్దువ ఆనించుకొని దిగులు దిగులుగా కూర్చున్నారు. మొదటివ్యాన్లో నడీడు దాటిన బట్టతల పోలీసు సంబంధంలేని విషయాలు మాట్లాడుతున్నాడు. మంత్రాలమీద నమ్మకంగల మరో తురకపోలీసు "గోండు మంత్రం జొర్దస్తీది.. తెరిమాకా ఇక్కడపుట్టి అక్కడ తేల్తదట బయీ. షేర్‌కు మూహ్ బందు కరుకే - కౌన్ పకడ్తె కత్తే...." పాములాగా నాలుక తాప తాపకు కొస బయటకుతెస్తూ ఎవరువిన్నా విననున్నా చెప్పుకపోతున్నాడు.

· వెనుకవచ్చే జీపులో నలుగురు రిజర్వు యస్. ఐ. లు - ఒక సర్కిల్ కూచున్నారు. నలుగురిల్లో కణతల్లో చిన్నగా బొబ్బలుగల ఒక యస్సై ఒక నెల సెలవెట్లా సంపాదించాలా అని ఆలోచిస్తున్నాడు. ఈ మోఖలో తాట్‌బూట్ అంటే సెలవు దొరకవచ్చని ఆశ. ఇంకొకతనికి ఈ అడివి ప్రాంతంనుండి ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ కావాలా? దానికి ఏమేమి చేయాలా? అనే ఆలోచన. ఇంకొకతనికి కనీసం సర్కిల్ ప్రమోషనైనా కావాలనే ఆశ. ఇంకొకతనికి రిజర్వునుంచి సివిల్‌కు త్రై చేసుకోవాలనే తీరని వాంఛ.

సర్కిల్‌కు మాత్రం తిక్కతిక్కగా ఉన్నది. యస్. పి. కన్నా తనే తెలివి కలవాడినని - హైయ్యర్ ఆఫీసర్సు తనమాట పట్టించుకోవడంలేదని ప్రభుత్వాలు మారకపోతే తనెప్పుడో డి. యస్. పి కావాల్సింది కనీసం తను తీసుకునే రిస్కుకు రాష్ట్రపతి పతకమన్నా—ఎవడినన్నా ఎన్‌కౌంటర్ చేద్దామన్నా కుదరడం లేదు, సర్కిలుద్యోగంలో డి. యస్. పి దగ్గరనుండి అందరూ ఆర్డర్లు యిచ్చేవాళ్ళే - రెడ్డిపటేల పుట్టి తను జీ సాబ్ అనాలి. అదే యమరోతగా ఉన్నది. తనకు నాయ

కులమీద మంట-పోలీసు అధికార్లమీద మంట, జనంమీద అంతకన్నా ఎక్కువ మంట. వీటన్నిటికీతోడు అందరి మందిలో తను పెట్రోలింగు చేద్దామంటే వద్దంటడు. ఆ తరువాత మళ్ళీ ఆర్డరు. వాని ఆర్డరు పాటించడానికి అల్లాటప్పా కాదనుకున్నాడు. తను ఏదిచేసిన చెప్పి చెయ్యాలిట. ఈ పెట్రోలింగు తనకేమిటి? చేతులు ముంగట పెట్టుకొని కూర్చుంటే పోలీసు ఉద్యోగం నడవదని-యస్, పి కి. అర్థం గావాలి, అట్లయితే తనను అడిగేవాడుండడు గిరిజనులు రెచ్చిపోతే యస్. పి. కి పిచ్చెత్తుతుంది. పైనుంచి గవర్నమెంటు మొత్తుతుంది ఏం చేస్తాడో? ఎట్లా చేస్తాడో చూడాలి ఇదంతా తనే చేస్తున్నానంటాడు. ఐ జీ పి తో, డి ఐ జీ తో "ఐ టాకిల్డ్ దిస్.... ఐ ప్రిపేర్డు దిస్" అంట తనే చేసినట్టు చెప్పుకుంటడుకదా? నేనెందుకు రిస్కు తీసుకోవాలి....యస్. పి కాదు ఆ బాస్టర్డ్సును కిందిసర్కిల్సే ఎదుర్కొంటున్నట్లు పోలీసు అథారిటీస్‌కు అర్థం కావాలి.

ఇంతలోనే అంకోలి కూడా దాటిపోయింది జీబు ఆగిపోయింది. డ్రైవరు బిక్కముఖం వేసి కిందికి దిగాడు. "ఇంజన్ ట్రబులిస్తుంది సాబ్" అన్నాడు.

సర్కిల్ జేబుల్లో చేతులు పెట్టుకొని కిందికి దిగాడు. యస్సైలు దిగారు.

"సార్ కనీసం అర్ధగంటయినా పడ్తది సార్" డ్రైవర్ బానెట్ ఎత్తి

"సరే మీరు వెళ్ళండి జీబు బాగు కాగానే నే నొస్త.... ఉషారుగా గుడిసెలు గాలించండి....జల్దిగా పెయ్యండి" సర్కిల్ సిగరెట్టు ముట్టించి.

అయిష్టంగానే యస్. ఐ. లు నలుగురు వ్యాన్లల్లోకి మారారు.

ఇద్దరు పోలీసులను వెంట ఉంచుకున్నాడు సర్కిల్.

వ్యాన్లు ముందుకు కదిలాయి.

లోకారి సమీపిస్తున్నదనగా ఒక యువకుడు వ్యాన్లను చూసి ఊళ్ళోకి వేగంగా పరుగెత్తాడు. వ్యాన్లు లోకారి చేరేసరికి "టట్టర....టట్టర" తుడుం యమ భయంకరంగా మోగసాగింది. పోలీసులకు వనుకు వొచ్చింది. యస్. ఐ. లు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. రెండే రెండు నిమిషాల్లో - చుట్టుపక్కల గల వాన్‌పట్, పిప్పల్‌ధరి, బీజ్‌ఘాట్, బోర్‌గాం, అంకోలీ....అడవులు దద్దరిల్లేటట్లు - ఎటు చూసినా తుడుంమోతే....బరిసెలు, కర్రలు పట్టుకొని అడివిల్లనుంచి, లొద్దుల్లనుంచి, చేండ్లల్లనుంచి ఎక్కడ పనుఘుంటె అక్కడినుంచి లోకారి కేసి పరుగెత్తారు. పోలీ

274

షులు వ్యాన్లు దిగనేలేదు. పిస్తోల్లమీద చేతులుంచి నలుగురు యస్సైలు వ్యాన్లు దిగి బిత్తరిచూపులు చూడసాగారు. మరో పావుగంటలో దాదాపు రెండువేలమంది జనం వ్యాన్లచుట్టూ మూగారు.

తొక్కిసలాట — పెడీ పెడీన కేకలు,

"ఊడువానికే" (దున్నేవానికే)

"భూమి ఫాజిలే" (భూమి కావాలి)

"కల్లేసర్కార్ తోడేంగే...."

పోలీసులను వ్యాన్లు దిగమన్నారు. బిక్కుబిక్కు మంటూ దిగారు. ఒక్క మాటన్నా మాట్లాడలేదు. ఏదో పనున్న వాళ్ళలాగా లోకారినుండి మామిడిగూడ కేసి నడవసాగిండ్లు. వాళ్ళముందు తుడుం కొడుతూ యువకుడు నడుస్తున్నాడు. మధ్యలో పోలీసులు వెనుక రెండువేలమంది జనం .... వాళ్ళ కసిని, కోపాన్ని మెడ నరాలుబ్బుతుండగా పెడీపెడీన కేకలు. ఇంకా దూరప్రాంతాలనుండి వచ్చే వాళ్లు వచ్చి చేరుతూనే ఉన్నారు.

వాళ్ళంతా మామిడిగూడ చేరుకునేసరికి పదకొండు గంటలయ్యింది....పోలీసులు వెనుకవచ్చి నిలిచిన వ్యాన్లలోకి ఎక్కి కూర్చున్నారు. వేల తలకాయల్లో నలుగురు యస్సయిలు చిక్కుబడిపోయారు.

ఒకామె గుక్క తిప్పుకోకుండా మత్తేదార్లు, కంట్రాక్టర్లు, అడివి అధికార్లు తమనెన్ని తిప్పలు పెట్టారో గొంతెత్తి అదో పాటలాగా బిగ్గరగా చెప్పింది. ఆఖరున యస్సై ముందుకొచ్చి "ఇన్నేండ్లు మమ్ముల పీక్కతిన్న సర్కారు మనుషులు మా గూడాలల్లోకి ఎందుకొచ్చిండ్లు?" అన్నది.

నలుగురు యస్సైల్లో ప్రమోషన్ కోసం ఆలోచించే అతను కొద్దిగా ఎకసెక్కెంగా "చూసి పోదామని వచ్చినం" అన్నాడు. మాట వ్యంగ్యం కాకుండా బెదురుగా వచ్చింది.

"మా మీదికి ఊ అంటే ఉరికచ్చే సర్కిల్‌గాడేడ బోయిండు" ఇంకొకామె కోపంగా.

ఏమి చేసేటట్టు లేదు. తమదగ్గర తుపాకులున్నాయి నిజమే. అవి కాల్చేకన్నా

ముందే ఈ జనం మీదబడతారు. ఎందుకొచ్చిందీ తిప్పలు – పోలీసులు చూస్తే వాళ్ళను దిగేటట్లు లేరు.

జనం వొత్తుకొత్తుగ మీది కొస్తున్నారు.

"మీరు మంచిగా ఉండాలంటే మరింక గూడాలల్లోకి రామని క్షమాపణ చెప్పి వెళ్ళండి" అరుపులు కేకలు.

చేసేదేమీ లేక నలుగురిలో ఒకడు "మరింక రామ"ని క్షమాపణ చెప్పాడు.

"మీ అధికార్లకు చెప్పండి! గోండ్లకు భూములు గావాలని, రగల్ రాజ్యం వచ్చేదనుక లడాయి జేస్తమని చెప్పండ్లి. నైజాం మునిగిండు, కాంగిరేసు మునిగింది - తెలుగుదేశం మమ్ముల ముంచింది...." సోనేరావు అనే యువకుడు బిగ్గరగా మాట్లాడాడు.

"ఆత్రం అశోకును మీరే చంపిండ్లు ఉల్టా మా నాయకుడు అన్మంతరావును జేల్లేసిండ్లు – మా నాయకున్ని విడువకుంటే మేం ఊకోమని మీ సర్కారుకు చెప్పండ్లి...." ఇంకొకడు.

పోలీసులు వెనక్కి తిరిగారు....దిగాలుబడ్డ ముఖాలతో.

ం ం ం

అక్కడ అంకోలి కేవల సర్కిల్ సిగరెట్లు తాగుతూ నిల్చున్నాడు. పోలీసులు వెళ్ళిపోయిన తరువాత అరగంటకు జీపు స్టార్టయ్యింది. సర్కిల్ కూసున్నాడు. పోలీసులు కూర్చున్నారు. ఇంతలోనే భయకరంగా తుడుం మోత – అంకోలినుండి జనం అడవిలో నుండి లోకారి దిక్కు జట్లుజట్లుగా పరుగెత్తడం సర్కిల్ చూసిండు. ఆ తరువాత అన్నివేపులనుండి తుడుం మోగడంతో సర్కిల్‌కు మతిపోయింది. జీబు వెనక్కి తిప్పమన్నాడు. అదిలాబాదు చేరుకునేసరికి పన్నెండయ్యింది. ఆదరబాదరాగా జీబును ఒక దినపత్రిక విలేకరింటి ముందు ఆపాడు. తన ఉక్రోషాన్నంతా విలేకరికి చెప్పాడు.

ం ం ం ం

తెల్లారింది. యస్. పి. ఇంట్లో ఆ రోజు శుక్రవారం కనుక నౌఖర్లు, పోలీసులు కలిసి ఇల్లంతా కడుగుతున్నారు. వైర్‌లెస్ ఆపరేటర్ పరుగెత్తుకొచ్చాడు. కళ్ళు విప్ప

గానే డి. ఐ. జి. నుంచి వైర్‌లెస్. సైటుగౌనుతినే స్లిప్పర్లన్నా వేసుకోకుండా పరుగెత్తాడు.

"మీ సర్కిల్‌గాడేదో పేపర్ల స్టేటిమింటిచ్చినాడు, చూశావా....బయటినుంచి డి. ఐ. జి. ఇదే విషయంగూర్చి ఐ.జి.పి, డి. ఐ. జి. ఇంటిలిజెన్సు డి.జి.పి. హోం మినిస్ట్రీనుండి ఎంక్వయిరీలు.

యస్. పి. కి ఎట్టకేలకు తెలుగు దినపత్రికలో ఎవడో కొంప ముంచినట్లుగా అర్థమయ్యింది. తెప్పించాడు. "తీవ్రవాదుల స్వైరవిహారం" హెడ్‌లైన్లు చూసి అదిరిపోయాడు. "జంకుతున్న పోలీసులు....ఆదిలాబాద్ తాలూకాలో ఉగ్రవాదులకు గోండ్ల తిరుగుబాటుకు భయపడి పోలీసులు గ్రామాల్లో గస్తీ తిరగటం నిన్నటినుంచి నిలిపివేశారు. పోలీసులు గస్తీ తిరగడానికి పోతే గోండ్లు అడ్డగించి తమ ఇష్టంవచ్చినట్లుగా తిడుతూ అవమానిస్తున్నందున పోలీసులు మొన్న ప్రత్యేక సమావేశం జరిపి ఈ మేరకు నిర్ణయించారు. పోలీసులను గస్తీకి పొమ్మని ఆదేశిస్తే వెళ్ళడానికి ఇష్టపడటం లేదని, మరెక్కడికైన బదిలీ చేయమని కోరుతున్నారని సర్కిల్...." పేపరు గిరవాటేసి గబగబా ఫోనెత్తి ఎవరినో చెడామడా తిట్టి - ఆ దినపత్రికను స్వాధీనం చేసుకొని కాలబెట్టవలసిందిగా ఆదేశమిచ్చాడు.

మళ్ళీ పేపరు తీసుకున్నాడు. ఈ పాటికే అది సర్క్యులేటయ్యి ఉంటుందని తోచింది. యస్. పి. కి బుర్ర వేడెక్కింది. ఫోన్ చేసి సర్కిల్‌ను పిలిచాడు. సర్కిల్‌ను తిట్టినతిట్టు తిట్టకుండా అర్ధగంట తిట్టాడు.

"పోలీసులు ధైర్యస్థులేనని, ఇంద్రవెల్లిలో పోలీసు చనిపోయినా గోండుల అరాచక చర్యలను, వారిని ప్రేరేపిస్తున్న తీవ్రవాదశక్తులను అరికట్టడానికి, సమూలంగా తుడిచిపెట్టడానికి పోలీసులు ఆత్మవిశ్వాసంతో పని చేస్తున్నారని, కరపత్రం మధ్యాహ్ననికల్లా సిద్ధం చేయించి పంచాలి."

సర్కిల్ ముఖం మాడిపోయింది. జీపెక్కిన తరువాత పట్టరాని కోప మొచ్చింది.

మధ్యాహ్ననికల్లా పంచాలన్న కరపత్రాలు వాడవాడలా సాయంత్రానికల్లా పోలీసులే పంచారు. ఈలోగా యస్. పి. కి ఒక పదిసార్లన్నా వైర్లెస్‌లో ఎంక్వయి

277

రీలు, మందలింపు లొచ్చాయి. అసెంబ్లీలో చర్చ జరిగినట్టు - భయపడుతూనే తమ ప్రాణాలకు ముప్పున్నా ప్రజలతరఫున అన్నిటికి సిద్ధపడి ఈ విషయం ప్రస్తావిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు ఎమ్. ఎల్. ఏ., బి. జె పి ఎమ్మెల్లే - కాంగ్రెస్ ఎమ్మెల్లే ఏక కంఠంతో ఉద్ఘాటించినట్లు వార్తలొచ్చాయి.

వాళ్ళందరు పట్టుపడుతున్నారు గనుక ఆదిలాబాదు మత్తేదారైన విధాన పరిషత్తు చైర్మన్ ప్రత్యేక సమావేశానికి అనుమతించాడు.

o o o

ఆ రోజు మార్చి తొమ్మిదవ తేది. ఆదిలాబాదులోని ఇతర ప్రాంతాలనుండి ఆదిలాబాదుకు అదనపు బలగాలను పిలిపించాడు యస్. పి. మూడు వ్యాన్‌లు, ఆరు జీబులు సిద్ధంగా వున్నాయి, ఆదిలాబాదు పట్టణం పోలీసులతో నిండిపోయింది. ఏదో జరుగబోతున్నట్లుగా - యుద్ధ వాతావరణంతో నిండిపోయింది.

అర్ధరాత్రి దాటిపోయింది. దాదాపు 2 గం|| రాత్రి యస్. పి. ఆఫీసులో ఎర్రగా ఉబ్బిన కళ్ళతో, ఎడతెరిపి లేకుండా సిగరెట్లు తాగుతున్నాడు. ఆయన ఎడమ పక్క గోడకు ఒక పటం తగిలించి ఉంది.

ఆ పటంమీద కర్ర తిప్పుతూ యస్. పి. చెప్పుతున్నాడు. "ఆ గుట్టల్లో దళాలున్నాయి. జామిని,తోయగూడ, మేడిగూడలో తప్పకుండా వాళ్ళఅగ్గనై జర్గున్నారు. మీరిప్పుడే వెళ్ళాలి. టిఫిన్‌లు, తిండి అన్నీ సిద్ధం చేసుకోండి. జామిని, తోయగూడ, మేడిగూడాలను ఎన్‌సర్కిల్ చేయాలి" సర్కిల్ ముగించాడు.

మరో పది నిమిషాలల్లో మూడు వ్యాన్‌లు, ఆరు జీబులు బయలుదేరాయి. నెల ఎప్పుడో గూకింది. చిక్కగా, చీకటి చీకటిగా పరుచుకొని ఉన్న చెట్ల నీడల ఛేదిస్తూ.... ఆ పటాలం సాత్నాల చేరుకునేసరికి రాత్రి మూడున్నర. అక్కడ మూడు బ్యాచ్‌లుగా విడిపోయారు. సర్కిల్ జామినీకేసి సాగే బ్యాచ్‌కు నాయకత్వం వహించాడు, జామిని ఊరి ముందు జీబులాపిండ్లు. లైట్లు బందు చేసిండ్లు. కుక్కలు జుయ్యి జుయ్యిన మొరగసాగినయ్. పట్లమీది ఎడ్లు బెదిరి తలుగులు తాళ్ళు తెంపుకున్నయ్. ఆ గడబిడలో ఒక గోండురైతు లేచి ఆదరబాదరగా తుడుం గొట్టిండు. సర్కిల్ ఆ రైతుమీద పడ్డాడు. తుడుం పగిలిపోయింది.

ఆ శబ్దానికి ఊరంతా లేచింది. ఏది దొరికితే దానితోని ఆ చీకట్లోనే పోలీసుల

మీద పడ్డారు. ఇస్రూ అనే గోండురైతు బల్లెంతో సర్కిల్‌మీద పడ్డాడు సర్కిల్ టోపీ కిందబడ్డది. లొల్లి-ఏడుపులు, అరుపులు, తిట్లు - పోలీసులు జనం కలబెని గారు పోలీసులకు జనానికి దెబ్బలు తాకినయ్. తెల్లారే చుక్కపొడిచే సమయానికి 9 మందిని తుక్కు-తుక్కు గొట్టి జీబులేసిండ్లు. నలుగురు పోలీసులు నడవలేకుండయి పోయారు. వాళ్ళ తోయగూడ వేపు కదిలేసరికే తోయగూడెం పోయిన బ్యాచ్‌లోని పోలీసులు, యస్సయ్‌లు బట్టలు చిరిగి తన్నులుతిని పరుగెత్తుకొచ్చారు. మేడిగూడకు పోయిన వాళ్లేమయ్యారో తెలియదు. తుడుములు భయంకరంగా మోగుతున్నాయి. పోలీసులు ఒకరిమొకాలు ఒకరు చూసుకున్నారు. సర్కిలు నెత్తంతా దుమ్మే.

సర్కిలుకళ్ళు ఎర్రగా, అతను ఉన్మాదిలా బొబ్బలుపెట్టి అరుస్తున్నాడు. అప్పటికి కరకర పొద్దు పొడిసింది.

ఈసారి రెండుబ్యాచ్‌లు ఒక్కటై తోయగూడకేసి సాగాయి. సాత్నాల ప్రాజెక్టు కాలువల ప్రక్కన జీబులు, వ్యాన్‌లు ఆపారు. పది పన్నెండు సంవత్సరాల పిల్లని ఒక గోండుబాలుడు వీరావేశంతో తుడుము కొడుతున్నాడు. అప్పటికే వాళ్ళ దినుసులు పారబోయబడ్డాయి. గుడిసెలు కూలగొట్టబడ్డాయి. దొమ్మీలు జరిగాయి. స్త్రీల గుడ్డలు చింపారు.

స్త్రీల రొమ్ములమీద పోలీసులు గుద్దారు ... ఎండ ఎక్కిపోతోంది.

పోలీసులు ఊళ్ళెకుబోయి ఇదంతా చేశారు. ఒక్క పురుషుడన్నా కనిపించలేదు. మళ్ళీ వ్యాన్లదగ్గరి కొచ్చారు. వ్యాన్‌ల చాటునుంచి, కాలువల్లోనుండి జనం ఒక్కపెట్టున పోలీసులమీద పడ్డారు.

ముసలి ఎగోదిరావు పండ్లు పటపట కొరుకుతూ ఒక బండి ఎత్తుకొని పోలీసు మీద వేయబోయాడు. పోలీసు పరుగెత్తి ఎగోదిరావును పట్టుకున్నాడు. ముసలి ఎగోదిరావు. బతుకంతా తన్నులు, దాపులు తిన్న ఎగోదిరావు....నాగరికులు, సర్కారు తరిమి తరిమి కొట్టగా ఊపిరి సలుపక కీకారణ్యాలల్లోకి ముడుచుకపోయిన ముసలి ఎగోదిరావు....తన తరతరాల గోండు కసితో పండ్లు కొరుకుతూ పోలీసును బాదుతూనే ఉన్నాడు. పోలీసు స్పృహతప్పి పడిపోయాడు. ముసలి ఎగోదిరావు స్పృహతప్పి పడిపోయాడు.

సర్కిలు టియర్ గ్యాసుకోసం ఆర్డరిచ్చాడు. పోలీసులు టియర్ గ్యాసు గోళాలు విసిరారు జనం టియర్ షెల్సు తీసి దూరం విసిరి పారేశారు. కొందరు బుసబుస పొంగే వాటిమీద మట్టి చల్లారు. ఉల్లిగెడ్డలు వెంట తెచ్చుకున్నవాళ్ళు వాసన చూశారు. తమకున్న కర్రలలో, బండలతో ఆదివాసులు పోలీసులమీద మరొకమారు పడబోయారు. తుపాకులు మొరిగినయ్. గాలిలోనికి కాల్పులు సాగినయ్. గిరిజనుల్లు తగ్గారు.

అట్లా పోలీసులకు, ఆదివాసులకు తెల్లవారు ఝామున 4 గంటలకు మొదలయిన సంకుల సమరం ఉదయం పదిగంటలవరకు ముగిసింది.

పోలీసులు దాదాపు 150 మందిని అరెస్టు చేశారు. అందులో వాళ్ళ నాయకుడు భగవతిరావు కూడా ఉన్నాడు.

మూడు గ్రామాలను ధ్వంసంచేసి ఆదిలాబాదుకేసి పటాలం కదిలింది. పోలీసులంతా దెబ్బలు తిన్నారు. ఈ గండం గడిచినందుకు ఎవరికి వారికి చిత్రంగానే ఉన్నది. దాదాపు 20 మంది పోలీసులు వ్యాన్లల్లో దెబ్బలతో మూలుగుతున్నారు

వ్యాన్లు చెట్ల నీడల కిందినుంచి కదిలాయి... పోలీసుల ముఖాలల్లో విజయగర్వం లేదు. నెత్తురుచుక్క లేదు కాని ఆ నెత్తురు ముద్దలైన ఆదివాసులు - పిడికిళ్లెత్తి అడివి అడివంతా ప్రతిధ్వనించే విధంగా - పిట్టలు, జంతువులు అల్లకల్లోలమయ్యే విధంగా, గూడాలన్నీ ఆ గొంతులు వినిపించే విధంగా నినదిస్తూనే ఉన్నారు.

"కల్లేసర్కార్ తోడేంగే" (ఝూటా సర్కారును దించుతాం)
"రగల్ రాజ్జెం పైసివాకట్" (రగల్ రాజ్జెం గెల్చివస్తాం)
"ఊడువానికే భూమి పాజ్రలే"
"రైతు - బూతి సంగెం జిందాబాద్" (రైతుకూలి సంఘం జిందాబాద్)

---

మార్చి సంచికలో అసంపూర్తిగా ప్రచురింపబడిన 'జానకి విముక్తి' సమీక్ష మళ్ళీ మే సంచికలో కొనసాగుతుంది.

—సంపాదకుడు

280